తొలి ఓటు... మేల్కొలుపు..



- ఓటు వేసేందుకు ఆసక్తి చూపుతున్న యువత
- మండపేటలో 19 ఏళ్ల లోపు ఓటర్లు 5,805
- రామచంద్రపురంలో 4,912 మంది
- పార్లమెంటు పరిధిలో 37,411 మంది

కపిలేశ్వరపురం: ప్రజాస్వామ్యంలో ఓటు ఓ ఆయుధం... దేశ పరిరక్షణ, ఆర్థిక, సహజ వనరులను ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా కాపాడే ప్రభుత్వాలను ఎన్నుకునే ఎన్నికల ప్రక్రియలో ఓటు గొప్ప మార్గదర్శి. అంతటి ప్రాధాన్యం గల ఓటును సద్వినియోగం చేసుకోవడానికి దేశ ప్రజలు ఉవ్విళ్లూరుతుంటారు. యువతీ యువకులైతే ఓటు ఎప్పుడు వేద్దామా అని ఆతృతతో ఉన్నారు. ఫారం- 6 ద్వారా దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో కీలకంగా ఉన్నారు. వారి తీరుపై ఈ కథనం...

ఎన్నికల షెడ్యూల్ ఇలా...

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 25 వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 26న స్క్రూటినీ ప్రక్రియ, అభ్యర్థులు 29 లోగా తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవచ్చు. మే 13న పోలింగ్, జూన్ 4న లెక్కింపు, 6వ తేదీతో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ముగియనుంది. మండపేట తహసీల్దార్ కార్యాలయంలోనూ, రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయాల్లోనూ నామినేషన్లు స్వీకరిస్తారు.

మీ ఓటును ఇలా చూసుకోండి

ఓటు వేసే హక్కు అందించాలన్న తపనతో ఎన్నికల కమిషన్ పలు దఫాలుగా ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించింది. సార్వత్రిక ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకునే వారికి చివరగా ఈ నెల 15 వరకూ అవకాశం కల్పించింది. పరిశీలన అనంతరం నిర్ధారించిన ఓటరు జాబితా తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధంగా ఉంది. జాబితాలో పేరున్నదీ లేనిదీ చూసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో జాబితాను పరిశీలించుకునే సదుపాయాన్ని కూడా ఎన్నికల కమిషన్ కల్పించింది. స్మార్ట్ ఫోన్లో ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలను తెలుసుకోవచ్చు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లో సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ అని కనిపించిన చోట క్లిక్ చేయాలి. సెర్చ్‌బై కింద వచ్చిన ఆప్షన్లలో ఎపిక్ నంబర్ ద్వారా ఓటు వివరాలను తెలుసుకోవచ్చు. కంప్యూటర్ ద్వారా తెలుసుకోవాలనుకునేవారు హెచ్‌టీటీపీ://ఎలక్టోరల్ సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది.

రెండు నియోజకవర్గాల్లో 29 ఏళ్ల లోపు ఓటర్లు ఇలా...

నియోజకవర్గం	18-19 మధ్య వయస్సు	20-29 మధ్య వయస్సు
మండపేట పురుషులు	3,177	19,954
మండపేట స్త్రీలు	2,628	19,460
మండపేట ఇతరులు	-	03
మండపేట అసెంబ్లీ మొత్తం	5,805	39,417
రామచంద్రపురం పురుషులు	2,651	16,928
రామచంద్రపురం స్త్రీలు	2,261	16,505
రామచంద్రపురం ఇతరులు	-	01
రామచంద్రపురం అసెంబ్లీ మొత్తం	4,912	33,434
అమలాపురం పార్లమెంట్ పురుషులు	20,490	1,31,452
అమలాపురం పార్లమెంట్ స్త్రీలు	16,920	1,25,311
అమలాపురం పార్లమెంట్ ఇతరులు	01	09
అమలాపురం పార్లమెంట్ మొత్తం	37,411	2,56,772

సిరా చుక్కపై ఆసక్తి



ఓటు వేసి వచ్చిన పెద్దవాళ్ల చేతివేళ్లకు ఉండే సిరా చుక్కను చూసి చిన్నపుడు ఆసక్తి కలిగేది. అలా ఎందుకు వేస్తారని అడిగినపుడు రెండోసారి ఓటు వేయకుండా నియంత్రించేందుకని చెప్పేవారు. ఆ సిరాపై వేసిన ప్రశ్న కాస్తా ఓటు వేయాలన్న కోరికను పెంచుతూ వచ్చింది. ఆ కోరిక సార్వత్రిక ఎన్నికల్లో తీరుతున్నందుకు సంతోషంగా ఉంది.

– పెద్దింశెట్టి రిషిత, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

ఎదురు చూస్తున్నా



మండపేట 27వ వార్డుకు చెందిన నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్నాను. ఇటీవలే కొత్తగా ఓటు హక్కు పొందాను. వర్తమాన రాజకీయ పరిణామాలపై అవగాహన ఉంది. ఓటు వేసేందుకు మే 13 ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాను.

– షేక్ ఇస్మాని, మండపేట

ఓటు ప్రాధాన్యం తెలుసుకున్నా



మండపేట 25వ వార్డుకు చెందిన నేను బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాను. ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు ద్వారా తెలుసుకున్నాను. ఓటు ప్రాధాన్యం గురించి అవగాహనతో ఉన్నాను. పోలింగ్ రోజు ఎక్కడ ఉన్నా పట్టణానికి వచ్చి ఓటు వేస్తాను.

– సయ్యద్ జవహర్, మండపేట

సంతోషంగా ఉంది



ప్రస్తుత ఎన్నికలు ఆసక్తిగా మారాయి. ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఉందనిపిస్తోంది. కచ్చితంగా ఓటు వేయాలన్న తపన ఉంది. అందు కోసమే ఓటు హక్కు పొందాను. ఓటు వేయాలన్న ఆసక్తితో ఉన్నాను.

– గారపాటి దుర్గా భవాని, మెర్నిపాడు, మండపేట మండలం

రెండు ఓట్లు వేస్తా



కొత్తగా ఓటు హక్కు పొందాను. సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలు కావడంతో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులిద్దరికీ ఓటు వేయాల్సి రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. మే 13న కచ్చితంగా స్వగ్రామమైన కపిలేశ్వరపురం మండలం నల్లూరు వెళ్లి ఓటు వేస్తాను.

– వేల్పూరి దివ్యసాయి శిరీష, నల్లూరు, కపిలేశ్వరపురం మండలం

ఓటుకు దరఖాస్తు చేసుకున్నా



మండపేట పట్టణం రావులపేటకు చెందిన నేను ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఎంసెట్ రాసేందుకు సన్నద్ధమవుతున్నాను. నాకు 18 ఏళ్లు నిండడంతో ఫారం- 6 ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకున్నాను. పరిశీలన అనంతరం ఓటు హక్కును కల్పించారు. ఆనందంగా ఉంది.

– అబ్దుల్ జలీల్ షేక్, మండపేట

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



ట్రస్టు సభ్యులకు విరాళం అందిస్తున్న దాత శ్రీనివాస్ దంపతులు

మండపేట: బురుగుంట చెరువు సమీపాన వెలిసిన అన్నపూర్ణమ్మ దేవాలయం కమిటీ అమ్మవారి పేరు మీద నడుపుతున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పట్టణానికి దాత గనిశెట్టి శ్రీనివాస్, చంద్రిక దంపతులు రూ.33,111 విరాళంగా అందించారు. శ్రీనివాస్ చంద్రిక దంపతులు ఇద్దరూ ఆదివారం అమ్మవారిని దర్శనం చేసుకుని ఈ విరాళాన్ని ట్రస్టు సభ్యులు కాశిన వెంకటేశ్వరరావు, మరో సభ్యుడికి అందజేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాల నిలిపివేత

కపిలేశ్వరపురం: గ్రంథాలయాల్లో సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన వేసవి విజ్ఞాన శిబిరాలను నిలిపివేస్తున్నట్టు కపిలేశ్వరపురం గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరాలను తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకూ ప్రారంభించ వద్దంటూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎస్ఎస్ వరప్రసాద్ ఆదేశించినట్టు తెలిపారు.

సీతమ్మ సేవలు అజరామరం



సీతమ్మ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పిస్తున్న క్లబ్ సభ్యులు

మండపేట: ఆంధ్రుల అన్నపూర్ణమ్మగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ సేవలు అజరామరం అని వాకర్స్ క్లబ్ ప్రెసిడెంటు కోన సత్యనారాయణ అన్నారు. డొక్కా సీతమ్మ 116 పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం పట్టణంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో ఉన్న సీతమ్మ విగ్రహానికి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు రెడ్డి రాజు, దూలం చక్రవర్తి, దూలి జయరాజు, గంపల సత్యప్రసాద్, తాతపూడి సుధీర్, పిల్లి శ్రీనివాస్, తిరుశూల వెంకట్రావు, లంక సత్తిబాబు, వాకర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల తప్పుడు ప్రచారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంద్రంగి నాయకులు

కాజులూరు: కూటమి నాయకులు ఉత్తుత్తి చేరికలు చేపట్టి వాటి ద్వారా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని మండల కాపు సంక్షేమ సంఘం నాయకుడు కేశన వీర్రాజు (బాబు) అన్నారు. ఆదివారం గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంద్రంగి గ్రామ సర్పంచ్ పెదిరెడ్డి నాగసుజాత వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరిందంటూ పలు పత్రికల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండించారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ మద్దతుతో నాగసుజాత సర్పంచ్‌గా గెలుపొందారన్నారు. సర్పంచ్‌గా ఉన్న కారణంగా గత మూడేళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాలలో అడపా, దడపా పాల్గొంటూ పనులు చేయించుకున్నారే తప్ప వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఆమె పనిచేయలేదన్నారు. కానీ కూటమిలో భాగస్వాములైన జనసేన నుంచి టీడీపీకి వెళ్లారని ఈ విషయంలో వైఎస్సార్ సీపీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మట్టా వెంకటరమణమ్మ, పార్టీ నాయకులు తొగరు మూర్తి, యాళ్ళ నరసింహమూర్తి, యాళ్ళ సత్తిబాబు, దేగల సత్యనారాయణ, ఆనాల సీత పాల్గొన్నారు.

11వ వార్డులో ప్రచారం

మండపేట: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు న్యూకాలనీలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కుమార్తె మణిమంజీర, ఆయన సోదరి కుమార్తె ముత్యాల మణిమంజీర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్లు శిరంగు జ్యోతి, గుండు రామతులసి, చింతలపూడి దుర్గ, కొవ్వాడ బేబి, మాజీ వైస్ చెర్‌పర్సన్ గడి సత్యవతి తదితరులతో కలిసి వారు ప్రచారం చేస్తూ తన తండ్రి జోగేశ్వరరావును గెలిపించడానికి సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గడి రాంబాబు, పట్టణ తెలుగు మహిళలు పాల్గొన్నారు.

గోగులమ్మ ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

రామచంద్రపురం రూరల్: వెలంపాలెం గ్రామ దేవత శ్రీ గోగులాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన వెండి మకర తోరణాన్ని సోమవారం అలంకరించనున్నారు. ఈ సందర్భంగా మేడవరపు శ్రీనివాసు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి భక్తుల గోత్ర నామాలతో కుంకుమ పూజలు, అనంతరం మాణిక్యాంబా మహిళా సమాజం సభ్యులతో లలితా పారాయణ నిర్వహిస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం విలేకరులకు తెలిపారు.

స్థానికుడిని.. ఓటు వేసి ఆదరించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్
- సూర్యప్రకాశ్‌కు మద్దతుగా రజక సంఘం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: మీలో ఒకడిగా ఉన్నాను, స్థానికుడిగా ఉంటున్నాను, అందరికీ అందుబాటులో ఉంటాను నన్ను ఆశీర్వదించండి అని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నియోజకవర్గ స్థాయి రజక సామాజిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోటిపల్లి శివాజీ, వేల్పూరి రాంబాబు, పాకలపాటి గోపీ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచారని, ప్రస్తుతం జరుగుతున్న ఎనికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనకు మద్దతునివ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎంతో మంది వస్తుంటారని, కాని నిరంతరం ఇక్కడే ఉంటూ నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటున్న తమను ఆదరించాలన్నారు. నియోజకవర్గంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని సూర్యప్రకాశ్ హామీనిచ్చారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలం, పట్టణానికి చెందిన రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా..

గ్రామాల్లో సూర్యప్రకాష్ ముమ్మర ప్రచారం



గుడిగళ్లబాగలో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్‌ను గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కె.గంగవరం: ఎన్నికల్లో ఓటేసి ఆదరిస్తే అన్ని విధాలుగా అండగా నిలబడుతానని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని శివల, గుడిగళ్లబాగ గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఐదేళ్ల మంచి పాలన అందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని పేద, బడుగు, బలహీన వర్గాలు మద్దతునిచ్చి గెలిపించాలన్నారు. 2024 జగనన్న మేనిఫెస్టో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి అయన ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ పన నాగమణి, సర్పంచ్‌లు అనుసూరి సాయి, పిల్లి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటి సభ్యులు బత్తుల అప్పారావు, పార్టీ నాయకులు ఓబులనేని రాజ్‌కుమార్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, ఇళ్లా సూర్యనారాయణ, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయ నేతలతో చేతులు కలిపింది ప్యాకేజీ స్టారే..



రాజానగరం పరిశీలకులు వట్టికూటి రాజశేఖర్

కె.గంగవరం: వారసత్వ రాజకీయల్లో భాగంగా సొంత మామనే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కుని రాజ్యాధికారం పొందిన చంద్రబాబుతో చేతుల కలిపింది ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణేనని వైఎస్సార్ సీపీ రాజానగరం పరిశీలకులు వట్టికూటి రాజశేఖర్ విమర్శించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో ఆదివారం జరిగిన ఆటోయూనియన్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ఇటీవల ద్రాక్షారామలో పవన్‌కళ్యాణ్ చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు. పవన్‌కళ్యాణ్ భారీగా ప్యాకేజీ తీసుకుని వారసత్వ రాజకీయాలు నడుపుతున్న చంద్రబాబుకు బానిసత్వం చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మంచి చేయాలని చూస్తుంటే ప్రతిపక్ష నేతలు మాత్రం అధికారం కోసం అడ్డదార్లు తొక్కుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ ఇచ్చిన ఏ మాటను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. 2019 ఎన్నికల మానిఫెస్టోను పక్కాగా అమలు చేసి రాజకీయాల్లో హీరోగా జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికలకు వెళ్తున్నారని ఆయనలా ధైర్యంగా ప్రజల ముందు ఓట్లు అడిగే అర్హత ప్రతిపక్ష పార్టీలకు లేదన్నారు.

పేద కాపులకు అండగా జగనన్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో పేద కాపులకు సంక్షేమ పథకాలు అందించి ఆ కుటుంబాలలో వెలుగులు నింపిన మొట్టమొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నియోజకవర్గ వైఎస్సార్ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. ఆదివారం గొల్లపాలెంలో బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి అధ్యక్షతన మండల కాపు సంఘ సభ్యులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపు సమాజికవర్గంలో అత్యధికులు పేదలే ఉన్నారన్నారు. సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా వారికి ఆర్థికతోడ్పాటు అందుతుందన్నారు. ముఖ్యంగా కాపులకు మరింత మేలు చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాపు నేస్తం రూ.60 వేలు నుంచి రూ.1.20 లక్షలకు పెంచారన్నారు. కాపులందరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను గెలిపించాలన్నారు. అనంతరం పలువురు కాపు నాయకులు మాట్లాడుతూ జగనన్న పాలనలో కాపులకు ఎంతో మేలు జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, కాపు సంఘం నాయకులు యాళ్ళ ధనరాజు, యాళ్ల బాబు, సలాది రమణ, వంగా రంగా, మాదవరపు నానాజి, సతీష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

'తోట' విజయానికి కృషి చేస్తాం

వైఎస్సార్ సీపీ సహాయ కార్యదర్శి ఇందుకూరు నరసింహరాజు



సీతానగరం సమావేశంలో సత్కారం అందుకున్న నరసింహరాజు

మండపేట: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విజయానికి క్షత్రియ సామాజిక వర్గం నుంచి తామంతా కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇందుకూరు నరసింహరాజు అన్నారు. మండపేట నియోజకవర్గంలో ఉండే క్షత్రియ సామాజికవర్గం నాయకులను ఆయన ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా క్షత్రియలు అధికంగా ఉన్న మండలంలోని ఏడిద సీతానగరంలో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు గోపాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నర సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీటీసీ అడ్డాల శ్రీదేవీ రామరాజు, గోపాలరాజు సమావేశానికి గ్రామంలో ఉండే అన్ని వర్గాల వారిని పిలిచి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జరిగాయన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మండపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తోట త్రిమూర్తులును, అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఆయన మండపేట విజయలక్ష్మినగర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువనేత పృథ్వీరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరదా చక్రవర్తి, ఆకుల చిన్నశీను, ఆకులు పుల్లయ్య, ఆకుల వెంకటేశులు, ముదునూరు సత్యనారాయణ రాజు, గురజాల సురేషు, వేగిరాజు నరశింహరాజు, వేగిరాజు కొండరాజు, గ్రామ వార్డు సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, క్షత్రియ సామాజికవర్గం నాయకులు పాల్గొన్నారు.

సూర్యప్రకాశ్‌ను గెలిపించండి



పట్టణంలోని ఇంటింటా ప్రచారంలో సూర్యప్రకాశ్ సతీమణి దివ్యశ్రీ

రామచంద్రపురం: విద్యావంతుడు, స్థానికుడిగా అందుబాటులో ఉంటున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్‌ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు కట్టా సూర్యనారాయణ తదితరులు పిలుపునిచ్చారు. సూర్యప్రకాశ్ సతీమణి దివ్యశ్రీ నేతృత్వంలో పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాగా వైఎస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరావు నేతృత్వంలో మరికొన్ని వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి గడచిన 58 నెలల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ తిరిగి నవరత్న పథకాలు అందాలంటే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో స్వేచ్ఛయుత వాతావరణం కోరుకునే ప్రతి ఒక్కరూ సూర్యప్రకాశ్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమం అభివృద్ధితో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు నల్లా అంజమ్మ, బాసిన నాగమణి, కేతా శ్రీను, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు మల్లిడి సాయిలక్ష్మి, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, పాలపర్తి మధు, కోటి దుర్గారావు, పాటి ప్రసాద్, జుత్తుగా గులాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రకాశ్ సతీమణి దివ్యశ్రీ ప్రచారం

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ సతీమణి పిల్లి దివ్యశ్రీ, తోడి కోడలు స్వాతి, ఇతర మహిళలతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని, ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తన భర్త సూర్యప్రకాశ్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా రాపాక వరప్రసాద్‌లను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆమె వెంట ఎంపీపీ అంబటి భవాని, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, గుత్తుల అచ్యుతవేణి, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, మాజీ సర్పంచ్ గొల్లపల్లి పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు చిరునామా సీఎం జగన్

మాచవరంలో వైఎస్సార్ సీపీ ప్రచారం



మాచవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

రాయవరం: విశ్వసనీయత అంటేనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి చిరునామాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి అన్నారు. మాచవరంలో ఆదివారం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజవకవర్గ అభ్యర్థులు తోట త్రిమూర్తులు, రాపాక వరప్రసాదరావుకు మద్దతుగా వారు ప్రచారం చేశారు. వెంకటరెడ్డి, త్రినాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావులు మాట్లాడుతూ 2019 మేనిఫెస్టోను ఒక చేత్తో పట్టుకుని 99 శాతం హామీలు నెరవేర్చామని వివరిస్తూనే, మరో చేత్తో 2024 మేనిఫెస్టోలోని అంశాలను ప్రకటించారని తెలిపారు. ఇదే తరహాలో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చూపే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట నెరవేర్చడం, మాట తప్పకపోవడంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. మరో ఐదేళ్ల పాటు అన్ని సంక్షేమ పథకాల అమలుకు జగనన్న గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఫలితంగా ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రచార కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు మేడపాటి వెంకటరెడ్డి, మేడపాటి బసివిరెడ్డి, కొవ్వూరి అప్పారెడ్డి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



మాజీ ఎంపీపీ సూరంపూడి, కాశీ విశ్వనాథంలతో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మాజీ ఎంపీపీ, అంగర గ్రామానికి చెందిన సూరంపూడి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ పుప్పాల కాశీ విశ్వనాథం ఆదివారం టీడీపీకి రాజీనామా చేసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తోట త్రిమూర్తులు నివాసంలో వారిద్దరికీ పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. సూరంపూడి మాట్లాడుతూ తాను ఎంపీపీ పదవిలో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న తరుణంలో అవిశ్వాస తీర్మానం పెట్టి పదవిని నుంచి తప్పించే ప్రయత్నం చేశారని, ఆ సమయంలో ఎమ్మెల్సీ తోట తనకు సాయమందించి ప్రజాస్వామ్య విలువలను కాపాడారని అన్నారు. కాశీ విశ్వనాథం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు కాశీ విశ్వనాథం తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే..



అర్తమూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ నాయకులు

మండపేట: అన్ని వర్గాల వారిని సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అర్తమూరులో ఆయన పార్టీ నాయకులు చిర్ల జయరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులును గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, ఎంపీటీసీ మండా సుమలత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెదురుపాకలో ప్రారంభించిన చలివేంద్రం

రాయవరం: వెదురుపాకలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక శ్రీగీతాజ్ఞాన మందిరం వద్ద ఆ మందిరం నిర్వాహకులు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో బాటసారులకు దాహార్తిని తీర్చే నిమిత్తం మజ్జిగ, నూకల జావ వేస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామస్తులు, దాతలు, భక్తుల సహాయ సహకారాలతో చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు.